

# అనగనగా ఓ నాన్న

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

**ఫిబ్రవరి** పన్నెండో తారీకు వార్త కూడా మొదటి పేజీలోనే ఉంది.

డి.ఐ.జి రఘునాథ్ కేసులోంచి తన కొడుకుని బయట పడేయడానికి పావులు కదుపుతున్నాడని, ఇండస్ట్రియలిస్ట్ గోవర్ధన్ డబ్బుని గుప్పించి తన కొడుకుని ఆ కేసులోంచి బయట పడేయడానికి ప్రయత్నిస్తున్నాడని, ఇందుకు ఇద్దరు యం.ఎల్.ఏలు సహకరిస్తున్నారని ఓ యం.ఎల్.ఏ నాంపల్లి స్టేషన్‌కి వెళ్ళి సి.ఐ అబ్బాస్‌తో ఆ ఇద్దరు నిందితుల తరపున మాట్లాడారని, అయితే యం.ఎల్.ఏ తనకి కలిసింది ఈ కేసు విషయం మీద కాక తన నియోజక వర్గంలో జరిగిన ఓ దొంగతనం గురించి చర్చించడానికి వచ్చాడని అబ్బాస్ ఆంధ్రజ్యోతి విలేఖరికి చెప్పాడని అందులో వార్త వచ్చింది.

ప్రతీ దినపత్రికని క్షుణ్ణంగా చదువుతున్న త్రివిక్రంకి లేఖలు శీర్షికలో వచ్చిన ఓ ఉత్తరం కనపడింది. ప్రమీల మీద అత్యాచారం జరిగిన పబ్లిక్ గార్డెన్స్ గేట్‌లని అర్థరాత్రి తెరిచి ఉంచిన వాచ్‌మేన్ మీద అధికారులు, ప్రభుత్వం ఎందుకు చర్య తీసుకోలేదని ప్రశ్నిస్తూ ఓ పాఠకురాలు రాసిన లేఖ అది.

దాదాపు గంటన్నరసేపు త్రివిక్రం మరో నలభై రోజుల దినపత్రికలని చదివాడు. ఆ కేసు విచారణ ఎలా సాగిందో అతనికి అర్థమైంది. నిందితులు రెండు వారాలు జుడీషియల్ కస్టడీలో ఉన్నాక, దాన్ని మళ్ళీ మెజిస్ట్రేట్ పొడిగిస్తూనే ఉన్నాడు. అలెగ్జాండర్ తల్లి తన కొడుకు నిర్దోషి అని, దోషుల తండ్రులు వారిని బెయిల్ మీద విడిపించారని, తనకి వెనక ఎవరూ అండలేకపోవడంతో తన కొడుకు జైల్లో మగ్గుతున్నాడని, కేసుని తన కొడుకు దోషిగా తప్పు దారి పట్టే ప్రయత్నాలు సి.ఐ అబ్బాస్ చేస్తున్నాడని ఆరోపించినట్లు వార్త వచ్చింది. ప్రమీలకి న్యాయం చేయాలని పోరాడే మహిళా సంఘాల ప్రతినిధుల స్టేట్‌మెంట్స్, చేసిన ధర్నాల వివరాలు కూడా వార్తలుగా రాసాగాయి.

నలభై రోజుల తర్వాత ఆ కేసుకి సంబంధించిన వార్తలు క్రమేపీ అడపాదడపా కోర్టులో కేసు జరిగినప్పుడే రాసాగాయి.

తనకి కావలసిన ముఖ్య సమాచారం లభించిందనుకున్న త్రివిక్రం తర్వాత ఈనాడు దినపత్రికని తెరిచి అందులో సమాచారం కూడా చదివాడు. మేజిస్ట్రేట్ పేరు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పేరు రాసుకున్నాడు.

ఆ కేసు తీర్పు ఎప్పుడు వచ్చిందో తెలీలేదు. కొన్నేళ్ళ తర్వాత ఎప్పుడో వచ్చి ఉండచ్చు. మళ్ళీ పై కోర్టుకి అపీల్‌కి వెళ్ళి ఉంటారు. ఆ సమాచారం తన అన్వేషణకి అనవసరం అని, తనకి అవసరం ఉన్న సమాచారం మొత్తం లభ్యమైందనుకున్న తృప్తితో కంప్యూటర్‌ని ఆఫ్ చేసి లైబ్రేరియన్‌కి థాంక్స్ చెప్పి త్రివిక్రం బయటకి నడిచాడు.

9

డాక్టర్ జాబాలి పేరుకి తగ్గట్లుగానే తమాషా మనిషి. అతనికి చిరునవ్వులంటే ఇష్టం. తన దగ్గరకి వచ్చే కొందరు రోగులు ఎంతో మానసిక వత్తిడితో వస్తారని, వారి వత్తిడిని తగ్గించడానికి డాక్టర్ వారిని నవ్వించాలని అతను యం.ఎస్ చేసేప్పుడు ఓ ప్రొఫెసర్ పదేపదే చెప్పేవాడు. స్వతహాగా సరదా మనిషైన జాబాలి ఆ ఆదర్శాన్ని గుర్తుంచుకుని అక్షరాలా పాటిస్తున్నాడు. అతని దగ్గర డ్యూటీ పడితే

నర్స్‌లకి సంబరమే. అతని హాస్య సంభాషణతో కాలం తెలీకుండా డ్యూటీ పడింది. అక్కడికి డబ్బున్నవారు కాక, సాధారణంగా తక్కువ ఆదాయంగల గుడిసెవాసులు వస్తూంటారు. వాళ్ళల్లో బాగా ధనవంతుడు స్వంత ఆటోగల డ్రైవర్ స్థాయికి చెందినవాడై ఉంటాడు. ఓ ముసలావిడకి బాగా రొంప చేసింది. అది లంగ్ ఇన్‌ఫెక్షన్ వల్ల వచ్చిందేమోనని అనుమానించి, అందుకు సంబంధించిన పరీక్షని క్రితం రోజు డ్యూటీ డాక్టర్ రాసాడు. ఆవిడ ఆ పరీక్ష రిజల్ట్‌తో వచ్చింది.

లంగ్ ఇన్‌ఫెక్షన్ కాదని తేలిపోవడంతో రొంప తగ్గే మందులని రాసిచ్చాడు.

"ఎక్కువ మందులు రాయండి డాక్టరుగారూ" ఆవిడ సంతృప్తిగా కోరింది.

ఎన్ని ఎక్కువ మందులు వాడి, ఎన్ని ఇంజక్షన్లు తీసుకుంటే అంత త్వరగా రోగం నయమవుతుందని అక్కడికి వచ్చేవారి అభిప్రాయం.

"అవ్వా! మంచి డాక్టర్ ఎవరో తెలుసా? మందుల వల్ల రోగం తగ్గదని, అది దేవుడి వల్లే తగ్గుతుంది అని తెలుసుకున్నవాడే మంచి డాక్టర్" నవ్వుతూ చెప్పాడు.

"నా మనవడికి కూడా దగ్గు. వాడికీ విటమిన్ మందులు రాయి దొరా" కోరిందామె.

"వాడికి ఎన్నేళ్ళు?"

"రెండేళ్ళు"

"ఏ.బి.సి.డిలు వచ్చా?"

"రావు"

"అయితే ఏ విటమిన్ కాని బి విటమిన్ కాని, సి లేదా డి విటమిన్ కాని వేసినా పని చేయవు. వాడికి ఏబిసిడిలు నేర్పించాక మళ్ళీరా."

ఆ మాటలు విన్న నర్స్ ఫక్కున నవ్వింది.

ఓ మధ్య వయస్కుడు తన రిపోర్ట్‌ని తీసుకువచ్చాడు. అతని కొలెస్ట్రాల్ ఉండాల్సిన దానికన్నా రెండింతలు ఎక్కువ ఉందని గ్రహించిన జాబాలి చెప్పాడు.

"నువ్వు వేపుళ్ళు, మాంసం మానేసావా? లేదా?"

"మానేసాను."

"మానేస్తే రిపోర్ట్ ఇలా ఉండదే? అబద్ధం దేనికి? నీ ఇష్టం వచ్చినంత తిను. ఎందుకో తెలుసా?" అడిగాడు.

తెలియదన్నట్లుగా తల అడ్డంగా ఊపాడతను.

"నిత్యం నువ్వు తినేదాంట్లో సగం నువ్వు బతకడానికి ఉపయోగిస్తుంది మిగిలిన సగం డాక్టర్లు, మందుల షాపుల వాళ్ళు బతకడానికి ఉపయోగిస్తుంది."

నర్స్ మళ్ళీ ఫకాలున నవ్వింది.

ముందు జాబాలి అతని బి.పిని చూసాడు. తర్వాత నర్స్ అతని బరువుని చూసి రాసిచ్చింది. దాన్ని చదివి చెప్పాడు.

"నువ్వు ఇంకో అడుగున్నర పొడవు ఎదిగితే అప్పుడు నీ బరువు సరిపోతుంది."

"నేను ఎదిగే వయసు దాటిపోయింది కదా సామీ?"

"కదా! కాబట్టి నువ్వు పదహారు కిలోలు బరువు తగ్గాలి. లేకపోతే ఏ అర్ధరాత్రో నీకు హార్ట్ అటాక్ వచ్చే ప్రమాదం ఉంది జాగ్రత్త."

"వాకింగ్, స్విమ్మింగ్ మంచిదా డాక్టర్?"

"తాబేలు నడవదు, పరిగెత్తదు. కానీ అది ఐదారు వందల ఏళ్ళు జీవిస్తోంది. స్విమ్మింగ్ ఒంట్లోని కొవ్వుని కరిగిస్తే, మరి సముద్రంలో ఎప్పుడూ ఈదే తిమింగలాలు అంత పెద్దవి ఎలా అవుతాయి?"

నర్స్ మళ్ళీ నవ్వింది.

అతని కొలెస్ట్రాల్ తగ్గడానికి కాలం నువ్వు ఈ కంపెనీలో మందులు కొని వారి ఉద్యోగస్థులని పోషిస్తూండాలి."

జాబాలి నర్స్ వైపు తిరిగి చెప్పాడు.

"నిన్న సాయంత్రం నా క్లినిక్‌కి ఓ స్టమక్ అల్సర్ పేషెంట్ వచ్చింది. ఆమె ఓ డాక్టర్ దగ్గరకి వెళ్ళి నా దగ్గరకి సెకండ్ ఒపీనియన్ కోసం వచ్చింది. నేనామెతో చెప్పాను. నా ఫస్ట్ ఒపీనియన్ మీకు స్టమక్ అల్సర్ ఉండటం కరెక్టే అని. నా సెకండ్ ఒపీనియన్ మీరు కురూపి అని చెప్పాను."

నర్స్ పగలబడి నవ్వింది.

"మీరు గైనకాలజీ చేసుంటే బావుండేది అని చాలామంది నర్స్‌లు అంటున్నారు డాక్టర్. అక్కడ డ్యూటీలో పనిచేసే వాళ్ళకి మీ దగ్గర పని చేసే అవకాశం రావడంలేదని వారు బాధ పడుతున్నారు" చెప్పింది.

"నేను గైనకాలజీ చేద్దామనుకునే మెడిసిన్‌లో చదివాను. కానీ మా నాన్న వద్దని సలహా ఇచ్చారు. ఆయన ఏం సలహా ఇచ్చారో తెలుసా? ఓ స్త్రీ మేల్ గైనకాలజిస్ట్ దగ్గరకి వెళ్ళటం అంటే, ఎన్నడూ సొంత కారులేని ఆటో మెకానిక్ దగ్గరకి వెళ్ళడం లాంటిది. దాంతో నాకు రోగులు ఉండరు అనుకుని గైనకాలజీ చదవలేదు."

"యు ఆర్ ఆల్వేస్ విట్టీ డాక్టర్" నవ్వింది నర్స్.

"అంతకాదని నా అనుమానం. ఎందుకంటే మనిషి మెదడు ఎదగడం ఇరవై నాలుగేళ్ళ తర్వాత స్లో అవుతుంది. డాక్టర్ అయితే పూర్తిగా ఆగిపోతుంది."

తర్వాతి పేషెంట్ ఆల్కహాలిక్. అతన్ని పరీక్షించి చెప్పాడు.

"ప్రకృతి ఏర్పరచిన అద్భుతాల్లో ఒకటి కుటుంబం. దాన్నించి నువ్వు ఎందుకు త్వరగా వెళ్ళిపోవాలని అనుకుంటున్నావు? ఇలా తాగుతూంటే నువ్వు నీ కుటుంబాన్ని విడిచి వెళ్ళిపోవాల్సి ఉంటుంది."

"ఎక్కడికి సారూ?"

"పైకి"

"అదేమిటి? దీన్ని ప్రపంచాన్ని విడిచి వెళ్ళటం అంటారుగా? కుటుంబం విడిచి అంటున్నారు మీరు?"

"నీకు నీ కుటుంబం ముఖ్యమా? లేక ప్రపంచమా?"

"కుటుంబమే."

"నీకు ఏది ముఖ్యమో దాన్ని విడిచివెళ్ళడం బాధేస్తుంది కాబట్టి ఉన్న నిజం చెప్పాను. నీ విందులో మందు ఉంటే ఉండనీ. కానీ నీ మందులో విందు, వినోదం ఉండవు. జాగ్రత్త. జీవితానికి సరిపడేంత తాగావు. ఇక మానేయి."

"మీరు హాస్యంగానే కాక వివేకంగా కూడా మాట్లాడతారు డాక్టర్" చెప్పింది నర్స్.

"అది నిజం అనుకోక. నా మెదడు కెపాసిటి సిక్స్ జిబినే. కొత్త హార్ట్ డిస్క్ నాకు అవసరం ఉంది ఈ రహస్యం ఎవరికీ చెప్పకే"

మళ్ళీ నర్స్ పకపకా నవ్వింది.

"పేదవాడికి ధనం మీద ఎలా దృష్టి ఉంటుందో, అలా అవివేకికి వివేకం మీద దృష్టి ఉంటుంది కదా సిస్టర్. నేను వివేకి అని నీ వివేకంతో గ్రహించలేదంటే ఆశ్చర్యంగా ఉంది సిస్టర్. ఇవాళ మే పదమూడు. ఈ రోజు ప్రత్యేకత ఏమిటో తెలుసా?" అడిగాడు జాబాలి.

"ఏమిటి డాక్టర్?"

"ఆడవాళ్ళు వాడే బర్త్ కంట్రోల్ పిల్‌కి ఇవాల్టితో ఏభై ఏళ్ళు పూర్తవుతాయి. మీ వయసు ఏభై ఒకటి అయితే, మిమ్మల్ని మీ తల్లిదండ్రులు వద్దనుకున్నా, మీరు పుట్టి ఉండే అవకాశాలు చాలా ఉన్నాయని తెలుసుకోవాలి. హేపీ బర్త్‌డే టు యూ బర్త్ కంట్రోల్ పిల్." మూడుసార్లు పాడాడు డాక్టర్ జాబాలి.

"మీకు రేపు పోస్ట్‌మార్టం డ్యూటీ కదా డాక్టర్?"

అవును. గతంలోలా ఇప్పుడు మానవదేహాలు అంత త్వరగా డీ కంపోజ్ కావడంలేదు. కారణం మనం తీసుకునే ఆహారపదార్థాల్లో ప్రిజర్వేటివ్స్ శవం త్వరగా కుళ్ళకుండా చేస్తున్నాయి."

డాక్టర్ జాబాలి డ్యూటీ అయిపోగానే అతను ఛార్జిని తన తర్వాతి డ్యూటీ డాక్టర్ త్రివిక్రంకి హేండోవర్ చేసి వెళ్ళిపోయాడు. త్రివిక్రం మాటల్లో హాస్యం తొంగి చూడదు. రోగికి ఉపయోగపడే విషయాలు చెప్పాలనే తపన అధికంగా కనిపిస్తుంది.

పక్షవాతం వచ్చి తగ్గిన తన మొదటి పేషెంట్ బంధువుతో చెప్పాడు త్రివిక్రం.

"పక్షవాతంకి మూడు లక్షణాలు ఉంటాయి. వాటిని ఎస్.టి.ఆర్ అంటారు. వాటిని గుర్తిస్తే అతనికి పక్షవాతం వచ్చిందని గ్రహించవచ్చు. ఎస్ అంటే స్మయిల్. పక్షవాతం వచ్చినతన్ని నవ్వమని చెప్పాలి. అతను నవ్వలేకపోవడం ఓ లక్షణం. టి అంటే టాక్. అతన్ని 'ఇవాళ ఎండ ఎక్కువగా ఉంది' లాంటి ఏదైనా సామాన్య వాక్యాన్ని మాట్లాడమనాలి. దాన్ని స్పష్టంగా మాట్లాడ లేకపోతే అది రెండో లక్షణం. చివరగా ఆర్ అంటే రైజ్. రెండు చేతులనీ పైకి ఎత్తమనాలి. ఈ మూడిటిలో ఏది చేయడానికి రోగి ఇబ్బంది పడ్డా, వెంటనే హాస్పిటల్‌లో చేర్పించాలి. మరో లక్షణం కూడా వారికి ఉంటుంది. నాలుకని బయటకి చాపమనాలి. అది సూటిగా బయటకి రాకుండా ఓ వైపు వంకరగా పడిపోతే అదీ పక్షవాత లక్షణమే."

అర్థమైనట్లుగా తల ఊపాడు ఆ రోగితో వచ్చిన బంధువు.

"పక్షవాత లక్షణాలు నోరు వంకరపోయి స్పృహ తప్పడం. అలా జరిగితే వెంటనే రెండు చెవులని ఎర్రబడేదాకాలాగి రెండు చెవులనించి రెండు చుక్కలు రక్తం కారేలా స్టెరిలైజ్ చేసిన పిన్‌తో గుచ్చాలి. అలా చేస్తే కొద్దినిముషాలకి రోగికి స్పృహ వస్తుంది. లేదా రోగి వేళ్ళ చివర్లలో గుచ్చాలి. రక్తం రాకపోతే అది వచ్చేలా వేళ్ళని నొక్కాలి. అప్పుడు అతనికి స్పృహ వస్తుంది. కుదుపులు లేని వాహనంలో రోగిని హాస్పిటల్‌కి తీసుకురావాలి. చైనీస్ ఆకుపంక్చర్ వైద్య మార్గంలోని పద్ధతులివి."

త్రివిక్రం డ్యూటీ సాయంత్రం అయిదున్నరకి పూర్తయింది. హౌస్ కీపర్‌గా సుందరేశ్వర్‌ని ఉద్యోగం లోకి తీసుకున్నప్పటి నించి డ్యూటీ అవగానే, తండ్రిని చూసుకోవడానికి హడావిడిగా ఇంటికి వెళ్ళాలి అనే బాధ తప్పింది.

అతను సరాసరి లాయర్ భాస్కరమూర్తి దగ్గరకి వెళ్ళాడు. ఆయన ఆఫీసు కింది అంతస్థులో. పైన కాపురం. త్రివిక్రం అరగంట వేచి ఉన్నాక ఆయన పైనించి ఆఫీస్‌లోకి వచ్చాడు. త్రివిక్రంని చూసి అడిగాడు.

"నిన్న మీకా కేసులో కావలసిన సమాచారం అంతా చెప్పాగా. ఇంకేమైనా అదనపు సమాచారం కావాలా?"

"ఆ పని మీద కాదు, నేను నా వ్యక్తిగత పనిమీద వచ్చాను."

"ఏమిటి కేసు?"

"నైన్టీన్ ఎయిటీలో పబ్లిక్ గార్డెన్స్‌లో ఓ అర్ధరాత్రి ప్రమీల అనే ఇల్లాలిని నలుగురు కాలేజీ విద్యార్థులు రేప్ చేసారు. అలెగ్జాండర్ అనే అతని తరఫున భాస్కరమూర్తి అనే లాయర్ వాదించారు అని పేపర్లో చదివాను. ఆయనా మీరు ఒకరేనా? కాకపోతే ఆయన ఫోన్ నెంబర్ మీకు తెలుసా? అది కనుక్కుందామని వచ్చాను."

భాస్కరమూర్తి వెంటనే ఆశ్చర్యంగా అడిగాడు.

"ఆ కేసు లాయర్ వివరాలు దేనికి?"

"అలెగ్జాండర్‌ని నేను కలుసుకోవాలని అనుకుంటున్నాను."

భాస్కరమూర్తిలో ఆశ్చర్యం అధికం అయింది.

"ఏనాడో జరిగిన ఆ కేసులో నిందితుడు అలెగ్జాండర్ వివరాలు ఇప్పుడు దేనికి మీకు?"

త్రివిక్రం ఆ ప్రశ్నకి జవాబు చెప్పబోయే ముందు గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు.

"ప్రమీల నా తల్లి." చెప్పాడు.

ఆయన నివ్వెరపోతూ చూసాడు. నోరు తెరిచి ఏదో మాట్లాడబోయి మళ్ళీ ఆగిపోయాడు. ఆయన తనకి కలిగిన షాక్‌లోంచి తేరుకోవడానికి రెండు నిముషాలు పైనే పట్టింది. తర్వాత ఆయన చిన్నగా తల పంకించి లేచి చెప్పాడు.

"నేనే ఆ భాస్కరమూర్తిని. ఇక్కడ కాదు నాతో రండి."

అలెగ్జాండర్ దగ్గరకి తీసుకెళ్తాడా అనుకుంటూ త్రివిక్రం భాస్కరమూర్తిని అనుసరించాడు. ఆయన లిఫ్ట్ దగ్గరికి వెళ్ళి దాని బటన్‌ని నొక్కాడు. కిందే ఉన్న లిఫ్ట్ తలుపులు వెంటనే తెరుచుకున్నాయి. ఇద్దరు మాత్రమే ఎక్కే ఆ హోం లిఫ్ట్‌లోకి ఇద్దరూ ఎక్కాక నాలుగో నెంబర్ బటన్‌ని నొక్కాడాయన. లిఫ్ట్ సరాసరి పైన టెర్రస్‌లోని చిన్న గదిలో ఆగింది. ఇద్దరూ లిఫ్ట్ లోంచి బయటకి వచ్చాక చూస్తే, ఆ గదిలో కంపోస్ట్ ఎరువుల వాసన వేస్తోంది. తోట పనికి ఉపయోగపడే అనేక పరికరాలు గోడలకి వేలాడుతూ కనపడ్డాయి. ఆ గది తలుపు గడియని తీసి భాస్కరమూర్తి టెర్రస్‌లోకి వెళ్ళాడు. త్రివిక్రం ఆయన్ని అనుసరించాడు.

టెర్రస్‌లో ఎక్కడ చూసినా మొక్కలు, పాదులు, లతలు. అంతా పచ్చగా ఉంది. కొన్ని పాదులకి ప్లాస్టిక్ గొట్టాలతో పందిళ్ళు వేసి ఉన్నాయి. నాలుగు బై నాలుగు అడుగుల స్థలంలో ఆరంగుళాల ఎత్తున ఇటుకలు బార్డర్‌గా పేర్చి ఉన్నాయి. లోపల నల్లటి మట్టి. విద్యుత్ వైర్లకి వాడే అరంగుళం ప్లాసిటిక్ గొట్టాలు అటూ ఇటూ అమర్చి ఉన్నాయి. అవన్నీ ఒకదానికొకటి ప్లాస్టిక్ వైర్‌తో కదలకుండా కట్టి ఉన్నాయి. దాంతో ఆ ఇటుకల వరస లోపల ఎనిమిది చతురస్రాలు ఏర్పడి మట్టి కనిపిస్తోంది. వాటిలో పదహారు మొక్కలు నాటి ఉన్నాయి. ఇలా ఎనిమిది చోట్ల ఇటుకలతో చేసిన చతురస్రాలు, వాటిల్లో పూలమొక్కలు అల్లుకుని ఉన్నాయి. పచ్చిమిర్చి మొక్కలని అతను ఆసక్తిగా గమనిస్తూండటంతో చెప్పాడు భాస్కరమూర్తి.

"నాకు తోట పనంటే ఇష్టం. దాంతో చాలాకాలంగా ఈ డాబా సేద్యాన్ని చేస్తున్నాను. ఈ పద్ధతిని స్క్వేర్ ఫుట్ గార్డెనింగ్ లేదా చదరపుటడుగుల తోట అంటారు."

"చాలా బావుంది. మీరెలా కనిపెట్టారిది?" అడిగాడు త్రివిక్రం.

"నేను కనిపెట్టింది కాదిది. నైన్టీన్ సెవెన్టీస్‌లో అమెరికాలో మెల్ అనే సివిల్ ఇంజనీర్ ఈ చిరు సేద్యాన్ని కనిపెట్టి అద్భుతాలని సాధించాడు. మా అబ్బాయి దగ్గరకి నేను కేలిఫోర్నియాకి వెళ్ళినప్పుడు ఓ తెలుగు వారింట్లోని టెర్రస్ మీద చూసి దీనిని గురించి క్షుణ్ణంగా తెలుసుకుని అడాప్ట్ చేసాను. స్క్వేర్ ఫీట్ విధానంలో సాధారణ తోటకి కష్టపడినట్లుగా కష్టపడక్కర్లేదు. కూలీల అవసరం ఉండదు. ఆ చదరాల్లో కింద రెండంగుళాల మందంతో ఎండిన ఆకుల చెత్తని నింపి, పైన మరో రెండు అంగుళాల

వానపాముల ఎరువుని, దాని మీద కంపోస్ట్ ఎరువు వేస్తే చాలు. ఇవేకాక పళ్ళు, కూరగాయల తొక్కలని ఇంటి బయట గుంటలో వేసి అవి కుళ్ళాక వాటిని కూడా ఇక్కడికి తెచ్చి ఎరువుగా వాడతాను. దీనివల్ల వేసవిలో ఇంట్లో అయిదు డిగ్రీల వేడి కూడా తగ్గుతుంది.''

త్రివిక్రం డాబా మొత్తం తిరిగి అనేక మొక్కలని చూస్తూంటే, ఆయన వాటిని పరిచయం చేసాడు.

''ఇవి బెండకాయలు, ఈ చదరం అంతా బంతి తోట. మా ఆవిడకి అమ్మవారిని నిత్యం పూలతో అలంకరించడం పిచ్చి. ఇవి వేరుశనగ మొక్కలు.''

ఒకదాన్ని పీకి ఆయన కింద వేర్లకి ఉన్న వేరుశనగ కాయలని త్రివిక్రంకి ఇచ్చి చెప్పాడు.

''నేను పురుగుల మందును అసలు వాడాను. ఈ పద్ధతిలోని తోటకి ఆ అవసరం రాదు.''

భాస్కరమూర్తి, త్రివిక్రం వెదురుతో చేసిన కుర్చీల్లో కూర్చున్నారు. నాలుగువైపులా నాలుగు వెదురు కుర్చీలు, మధ్యలో వెదురుతో చేసిన బల్ల.

''పౌర్ణమి రాత్రి నేనూ, మా ఆవిడ, మా కోడలు, కొడుకు ఇక్కడే భోజనం చేస్తాం. నా రెండో కొడుకు కూడా లాయరే.''

''హైదరాబాద్‌లో ఎవరికీ ఈ లగ్జరీ లభించదు.'' మెచ్చుకోలుగా చెప్పాడు త్రివిక్రం.

''నిజమే. ఈ రకం అభిరుచి ఉన్నవారు తక్కువ. ఏ.సి హాల్లో కన్నా ఇక్కడ హాయిగా ఉంటుంది.''

పనివాడు లిఫ్ట్‌లో ఓ రొట్టె, నిమ్మరసం, తేనె కలిపిన షర్బత్‌ని తెచ్చి ట్రేని వాళ్ళముందు పెట్టి వెళ్ళాడు.

''తినండి. ఇది తాటి గుజ్జుతో చేసిన తాటి రొట్టె. మాది గోదావరి జిల్లా. తాటి గుజ్జుని మా పల్లెనించి తెప్పించాను.'' చెప్పాడాయన.

దాన్ని తిని త్రివిక్రం.

''ఇలా చేస్తారని నేనెన్నడు వినలేదు.''

''పల్లెటూర్లలోనే ఆరోగ్యం, సంపద ఉంటాయబ్బాయ్. మనమ్మతా పల్లెటూళ్ళని వదిలి హైదరాబాద్‌కి ఎగబడుతున్నాం. కానీ అక్కడ లభించే ప్రశాంతత, సిటీలో ఎక్కడుంటుంది? ప్చ్! ఇప్పుడిప్పుడే పల్లెలూ మన సిటీల్లానే తయారవుతున్నాయి. టివిలు వచ్చాక గతంలోల త్వరగా నిద్రపోవడంలేదు.''

''బావుంది సార్ ఇది.'' త్రివిక్రం రొట్టెని మరో ముక్క తిని చెప్పాడు.

''ప్రమీల కొడుకువా నువ్వు? ఆ సరికి ప్రమీలకి పిల్లలు లేరు. తొందర్లోనే మరణించిందని పేపర్లో చదివాను. అంటే నువ్వు'' అర్థోక్తిగా ఆగిపోయాడాయన.

''అవును సార్. ఆ రేప్ ఫలితంగా పుట్టినవాడ్నే నేను. ఆ నలుగురిలో నా తండ్రి ఎవరో తెలుసుకోవాలనే ప్రయత్నంలో ఉన్నాను. ఆ సందర్భంగా ఆ నలుగురినీ కలిసి డి.ఎన్.ఏ టెస్ట్‌ని చేయాలని అనుకుంటున్నాను.''

''అలెగ్జాండర్ ఇప్పుడు ఎక్కడున్నాడో నాకు తెలీదు. నిజానికి అతను మంచివాడు. డబ్బున్న అతని ఇద్దరు మిత్రుల వల్ల తప్పుదారి తొక్కాడు. తర్వాత, జరిగిందానికి అతను ఎంతో పశ్చాత్తాప పడ్డాడని నాకు తెలుసు.''

''అతను ఇప్పుడు ఎక్కడున్నాడో తెలుసుకోవడం ఎలా? అతని తోబుట్టువులు కానీ, ఇంకెవరైనా మీకు తెలుసా?'' త్రివిక్రం భాస్కరమూర్తిని అడిగాడు.

''తెలీకేం? అతని తల్లి మరియమ్మది, నాదీ ఒకే ఊరు. మరియమ్మకి డేవిడ్‌తో వివాహమై కర్నూలు వెళ్ళిపోయింది. సీనియర్ లాయర్స్‌కి ఫీజ్ ఇవ్వలేక నన్ను ఆశ్రయించిందామె. నిజానికి నేను టేకప్ చేసిన నాలుగో కేసది.''

''వాళ్ళ ఊరు వెళితే అలెగ్జాండర్ వివరాలు తెలియచ్చంటారా?''

"అవును. ఊరి వాళ్ళు చెప్పగలుగుతారు. ఈ వివరాలన్నీ మీకెప్పుడు తెలుసు?"

"మా అమ్మ పోయాక."

టూకీగా త్రివిక్రం తన జీవితంలో తల్లిపోయాక జరిగినవన్నీ చెప్పాడు. ఆయన విన్నాక చెప్పాడు.

"వండర్! మీ అమ్మ సహజంగా ఇంట్లో పోయి ఉంటే అప్పుడు పోస్ట్‌మార్టం చేయాల్సిన అవసరం వచ్చేది కాదు. కొడుకు కాదని మీకు తెలిసేదే కాదు."

"అవును సార్. అదే నా లైఫ్‌లో టర్నింగ్ పాయింట్ అయింది. మిగతా ముగ్గురు ముద్దాయిల అడ్రస్‌లు లేదా వారి లాయర్ల అడ్రస్‌లు కూడా మీకు గుర్తున్నాయా? వారి పేర్లు.."

"గుర్తున్నాయి. నవనీత్ లాయర్ సుశర్మ ఆ రోజుల్లో హైదరాబాద్‌లోనే సీనియర్ లాయర్. ఆయన కన్నడం ఆయన. పోయాడు. వాళ్ళబ్బాయి హర్ష ప్రాక్టీస్ చేస్తున్నాడు. నవనీత్ తండ్రి వ్యాపారస్థుడు. హరినాథ్ తండ్రి ఐ.పి.ఎస్ ఆఫీసర్. ఆయన కూడా సిద్ధిక్ అనే సీనియర్ లాయర్‌ని పెట్టుకున్నాడు. ఇక మూడోవాడు కురంగేశ్వర్ తండ్రి బీదవాడు. టైలర్ అనుకుంటాను."

"సిద్దిపేటలో కిరాణా దుకాణం నడిపేవాడు."

"అలాటిదే ఏదో. అతనికీ పెద్దగా ఆర్జన లేదు. అతను లింబారెడ్డి అనే లాయర్ ని పెట్టుకున్నాడు. రెడ్డి లా కాలేజీలో నా క్లాస్‌మేట్. మేమిద్దరం జూనియర్స్‌మి కాబట్టి ఈ కేసు గురించి మాట్లాడుకునేవాళ్ళం. రెడ్డి నా కన్నా ప్రతిభగలవాడు. అతనిప్పుడు ఢిల్లీలో ఉంటూ, సుప్రీం కోర్ట్ కేసులు చేస్తున్నాడు. అతని గురించి ఢిల్లీలో వాకబు చేస్తే చిరునామా తెలుస్తుంది."

ఆయన చెప్పే వివరాలన్నీ త్రివిక్రం తన నోట్ బుక్‌లో రాసుకున్నాడు.

"థాంక్స్ ఫర్ యువర్ టైం సర్. నాకు మీతో మళ్ళీ ఏదైనా అవసరం పడితే ఇంకోసారి వచ్చి డిస్టర్బ్ చేస్తాను." చెప్పాడు.

"తప్పకుండా. నేను ఎన్నో కేసులు చూసాను. కానీ, మీరు నా దగ్గరకి రావడంతో మీ అమ్మది యునీక్ కేసవుతుంది. ఇంటర్నేషనల్ లా జర్నల్‌కి నేను తరచూ ఆర్టికల్స్ రాస్తూంటాను. ఇవన్నీ నేను ఓ ఆర్టికల్‌గా రాస్తే మీకేం అభ్యంతరం లేదుగా?" అడిగాడు భాస్కరమూర్తి.

"లేదు సర్."

"థాంక్స్. ఐ విష్ యూ ఆల్ ది బెస్ట్. కొన్ని బెండకాయలు కోసిస్తాను. రాత్రో, రేపు ఉదయమో మీ నందికేశ్వర్‌కి చెప్పి వండించండి. ఇంత తాజా కూరగాయలు మీకు హైదరాబాద్‌లో ఇంకెక్కడా దొరకవు."

"అతని పేరు సుందరేశ్వర్" త్రివిక్రం సరిదిద్దాడు.

ఆయన టేబుల్ మీది ట్రే అందుకుని అందులో అరకిలోదాకా బెండకాయలని కోసాడు. లిఫ్ట్‌లో ఇద్దరూ కిందకి వెళ్ళాక వాటిని ఓ కవర్లో పోసి ఇచ్చాడు.

త్రివిక్రం కారులో సరాసరి ఇంటికి చేరుకున్నాడు. ఆ బెండకాయలని చూసి ముచ్చటపడి చెప్పాడు సుందరేశ్వర్.

"ఇవి చాలా తాజాగా ఉన్నాయి. వీటితో ఈ పూట పచ్చడి చేస్తాను, రేపు కూర చేస్తాను."

అతను పచ్చడి చేస్తూంటే, త్రివిక్రం లాయర్ భాస్కరమూర్తి చెప్పిన విషయాలన్నీ సుందరేశ్వర్‌కి వివరించాడు.

"సమ్ గుడ్ ప్రోగ్రెస్. అయితే మీరు ఓసారి కర్నూలు వెళ్ళి రావాలన్నమాట" ఆయన చెప్పాడు.

"అతనికి కుదిరితే శ్యామలరావుని పంపాలని అనుకుంటున్నాను."

వెంటనే శ్యామలరావుకి ఫోన్ చేసి, అతను లైన్‌లోకి వచ్చాక అడిగాడు.

"ఈ ఆదివారం మీరు ఫ్రీయేనా? నా కోసం ఓసారి కర్నూలు వెళ్ళి రాగలరా?"

"మాకు ఆదివారం వర్కింగ్ డే సర్. సోమవారం సెలవు. ఆదివారం రాత్రి వెళ్ళి మంగళవారం ఉదయం వస్తాను. చెప్పండి. ఏం పని ఉందక్కడ?"

"కర్నూలు కలెక్టరేట్‌లో మరియమ్మ అనే ఆమె ముప్పై ఏళ్ళ క్రితం పని చేసేది. ఆవిడ రిటైరై ఉండచ్చు. ఇప్పుడు ఎక్కడుందో తెలుసుకోవాలి. ముఖ్యంగా ఆమె కొడుకు అలెగ్జాండర్ అడ్రస్ కావాలి. కలెక్టరేట్‌లో ఆ వివరాలు తెలీకపోతే దగ్గరే ఉన్న వాళ్ళ ఊరు బనగాన పల్లె. వెళ్తే తెలియచ్చు."

"అలాగే సార్. సోమవారం వర్కింగ్ డే కాబట్టి కలెక్టరేట్ కూడా తీసే ఉంటుంది. వెళ్ళొస్తాను. రేపు వచ్చి మిమ్మల్ని కలుస్తాను." ఒప్పుకున్నాడు శ్యామలరావు.

"బెండకాయ పచ్చడి చాలా బావుంది. ఇదే మొదటిసారి తినడం" చెప్పాడు త్రివిక్రం.

"వంకాయ పచ్చడి కామన్. చాలా తక్కువమంది బెండ పచ్చడి చేస్తారు. నాకు ఇష్టమని మా ఆవిడ దీన్ని చేసేది."

భోజనం అయ్యాక త్రివిక్రం తండ్రి దగ్గర కూర్చుని ప్రతీ రాత్రిలా పాత డైరీ తెరచి చదవసాగాడు. ఏదైనా ఒక సంఘటన, ఓ వాక్యం, ఓ పదం, ఓ మనిషి పేరు అతనిలోని జ్ఞాపకాలని రేపుతుందేమోనని త్రివిక్రంలో చిన్న ఆశ. ఐతే ఆ దిశగా అలాంటి లాభం ఇంకా అతనికి చేకూరలేదు. జనవరి ఒకటో తారీఖు ఎంట్రీలో ఇలా ఉంది.

"ఇవాళ రత్తాలు నేను డిక్టేట్ చేసిన ఇంగ్లీష్ వాక్యాలని తప్పు లేకుండా రాయగలిగింది. ఆర్నెల్ల నా శ్రమ ఫలించింది."

వెంటనే త్రివిక్రం ఆర్నెల్ల వెనక్కి వెళ్ళి వెదికి చూసాడు. జూన్ పధ్నాలుగో తారీఖు రత్తాలుకి సంబంధించిన ఎంట్రీ ఒకటి కనబడింది.

"రత్తాలుకి చదువు రాదు. ఈ రోజు జనని దగ్గరకి వచ్చి తనకి ఇంగ్లీష్, లెక్కలు నేర్పమని అడిగింది. 'ఎందుకిప్పుడు?' అని అడిగితే 'ఈ నెల నించి మా అబ్బాయిని స్కూల్లో వేస్తున్నాను. వాడి చేత హోం వర్క్ చేయించాలంటే నాకు చదువు రావాలి కదా అమ్మగారూ అన్నది. ఐ వజ్ టచ్డ్ నా డబ్బుతో వాచక పుస్తకాలు తెప్పించాను. ఆర్నెల్లలో ఆమె చేత ఇంగ్లీష్ వాక్యాలు రాయించాలన్నది నా తలంపు."

మూడు నెలల తర్వాత రత్తాలుకి సంబంధించిన ఇంకో ఎంట్రీ కనపడింది.

'పని చేస్తూ రత్తాలు స్పెల్లింగులని బయటికి చెప్తోందిట. జనని చెప్పింది. ఇలాంటి ఆసక్తి గల తల్లి ఉన్న పిల్లలు చదువులో పైకి వస్తారు. వాడి స్కూల్ ఫీజ్ నేనే కడదామనుకున్నాను. కానీ జనని వద్దని అడ్డుపడింది.'

తండ్రి వంక చూసాడు. ఆయన మొహంలో స్వల్ప తేడా కూడా లేదు. తన జీవితంలోనే ఆ సంఘటన జరిగినా, అది ఆయనకి గుర్తురాలేదు. ఆయన మెదడులోని కనెక్షన్స్ అన్నీ మూసుకు పోయాయని అనుకున్నాడు. మరి కొంతసేపు డైరీలోని ఆసక్తికరమైన విషయాలని బయటకి చదివాడు. కాని ఎప్పటిలా లాభం లేకపోయింది. రాంప్రసాద్ ఏ ఒక్క సంఘటన గురించీ కామెంట్ చేయలేదు.

తండ్రి పడుకున్నాక తన గదిలోకి వెళ్ళిన త్రివిక్రం కంప్యూటర్ ఆన్ చేసాడు. స్ఫూర్తి ఆన్‌లైన్‌లో ఉంది. వెంటనే ఉత్సాహంగా టైప్ చేసాడు.

"హలో! వాట్స్ న్యూ?"

"ఇవాళ సెన్సెక్స్ నలభై పాయింట్లు పెరిగింది. డాలర్ ధర ఎనిమిది పైసలు తగ్గింది."

బదులుగా స్మైలీ బొమ్మని పంపాడు.

"మళ్ళీ ఏదైనా రికార్డ్ చేసి పంపరాదు? మీ వాయిస్ వినాలని ఉంది."

"వేదాంత డిండిమ గురించి చెప్పనా?" స్మైలీ బొమ్మ.

"ప్రేమ గురించి చెప్పండి."

"నన్నెవరైనా 'ఐ లవ్ యూ' అంటే అది నన్ను వారు ముద్దు పెట్టుకుని చెప్తేనే నమ్ముతాను."

"వావ్!"

"వాళ్ళు 'వావ్' అనగానే 'ఇప్పుడు కాదు, ఇక్కడ కాదు, విమానంలో మాత్రమే అందుకు అనుమతిస్తాను' అంటాను."

"నాటే ప్రాబ్లం."

"మన విమానం నయాగరా మీద ఎగిరేప్పుడు సుమా అని చెప్తాను."

"వావ్! అది హనీమూన్ స్పాట్."

"ఎగ్జాక్ట్‌లీ. అప్పుడే నేను ప్రేమ గురించి మాట్లాడేది. నయాగరాలో హనీమూన్‌కి లీడ్ చేయని ప్రేమ నా దృష్టిలో వేస్ట్ ఆఫ్ టైం అండ్ ఎనర్జీ. పెళ్ళి తర్వాతి ప్రేమే ది బెస్ట్ నన్నడిగితే."

"మీ నాన్న పెంపకం చాలా మంచి పెంపకం అన్నమాట."

"అవును. మా నాన్న వల్లే నాకూ, నా సిబ్లింగ్స్‌కి ఐక్యూ పెరిగిందనే చెప్పాలి. అందుకు 'టేబుల్ టాపిక్స్' మాకు ఎంతో దోహదం చేసింది."

"టేబుల్ టాపిక్స్? ఎప్పుడూ దాని గురించి నేను వినలేదే?"

"మా ఇంట్లో డైనింగ్ టేబుల్ మీద 'టేబుల్ టాపిక్స్' అని రాసిన ఓ చిన్న కార్డ్ బోర్డ్ బాక్స్ ఉంటుంది. దాంట్లో పోస్ట్ కార్డ్ సైజ్‌కి కట్ చేసిన శుభలేఖలు ఉంటాయి. వాటి వెనుక మా నాన్న చేతిరాతితో రకరకాల టాపిక్స్ రాసి ఉంటాయి. ఆ కార్డ్‌లు ఎప్పుడూ వందపైనే ఉంటాయి. ఉపయోగించిన పాతవి తీసేసి నాన్న వాటికి కొత్తవి కలుపుతూంటారు. రోజూ రాత్రి భోజనం దగ్గర తలో కార్డ్ తీస్తాం. ఆ కార్డ్ మీద ఏం టాపిక్ రాసి ఉంటే ఆ కార్డ్ తీసినవారు దాని గురించి మాట్లాడాలి."

"హౌ ఇంట్రెస్టింగ్"

"మా వయసుని బట్టి టాపిక్‌ని రాస్తూంటారు. మా చిన్నప్పుడు 'సింహం, సినిమా హాల్, ఐస్ క్రీం' లాంటి టాపిక్స్ రాసేవారు. క్రమేపీ మేం హైస్కూల్లోకి వచ్చాక క్రికెట్, అన్నపూర్ణ స్టూడియోస్, ఎన్టీఆర్ యాజ్ కృష్ణలాంటి టాపిక్స్ రాసేవారు. ఇంకాస్త పెద్దయ్యాక ఫ్రీ రష్యా, జర్మనీ విలీనం, హాంకాంగ్ చైనాలో చేరడంలాంటి టాపిక్స్ వాటిల్లో ఉండేవి. వాటివల్ల మాకు ప్రపంచ జ్ఞానం బాగా అబ్బింది. మాట్లాడే కళ కూడా."

"వండ్రఫుల్. లేటెస్ట్ టాపిక్ దేని మీద మాట్లాడారు?"

"నువ్వు పెద్ద కంపెనీలో చిన్న ఉద్యోగిగా ఉండడానికి ఇష్టపడతావా? లేక చిన్న కంపెనీలో పెద్ద ఉద్యోగిగానా? నేను పెద్ద కంపెనీలో చిన్న ఉద్యోగిగా ఉంటానని చెప్పాను. చాలా నేర్చుకోవచ్చు. జాబ్ సెక్యూరిటీకి పెద్ద కంపెనీ బెటర్ అన్నది నా పాయింట్. మా అన్నయ్య చిన్న కంపెనీలో పెద్ద ఉద్యోగిగా ఉండటం ఇష్టం అన్నాడు. అధారిటీ అంటే వాడికి ఇష్టం."

"నైస్"

"మీకు తెలుసా? పి. కృష్ణమూర్తి నాయుడు మా తాతయ్య."

"ఎవరాయన?"

"రైటర్."

"తెలీదు. ఏం రాసారు?" ***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments